క్లుప్తంగా

బాలిక ఆపరేషన్‌కు ఆర్థిక సాయం



తాడికొండ: మాటలు రాని బాలిక పరిస్థితిని చూసి చలించిన వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాప ఆపరేషన్‌కు ఆర్థిక సాయం అందించారు. తుళ్లూరు మండలం మందడం గ్రామానికి చెందిన పులి విజయ్, ఎస్తేర్‌ల ఇద్దరు సంతానంలో స్వాతికి లోపం కారణంగా మాట్లాడలేకపోవడం, వినిపించని పరిస్థితితో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వైద్యులకు చూపించగా ఆపరేషన్‌కు భారీగా ఖర్చు అవుతుందని చెప్పిన నేపథ్యంలో తల్లిదండ్రులు మంగళవారం విషయాన్ని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆపరేషన్ నిమిత్తం తన వంతుగా ఆర్థిక సాయం అందించడంతో తల్లిదండ్రులు కన్నీళ్ల పర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

ఎస్ఈబీ జేడీ డీఎస్ మహేష్



మంగళగిరి: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ జేడీ డీఎస్ మహేష్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్ఈబీ కార్యాలయంలో మంగళవారం వసతి గృహ నిర్వాహకులకు మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి అలవాటు కారణంగా వారి భవిష్యత్తు ఎలా నాశనం అవుతుందో వసతి గృహ నిర్వాహకులు తెలియజేయాలన్నారు. వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థులపై నిరంతరం నిఘా ఉంచి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాల వినియోగంపై ఎవరి మీదైనా అనుమానం వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వారికి కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ మారయ్యబాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోరుతూ పాదయాత్ర



తాడేపల్లిరూరల్: రానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చందోలు విక్టర్‌పాల్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నగర పాలక సంస్థ పరిధిలోని నులకపేట వద్ద ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చందోలు విక్టర్‌పాల్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పాదయాత్రలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 7వ తేదీ హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ ఏర్పాటు చేస్తున్నామని, మాదిగలందరూ ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, ఎంఈఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి రామారావు, నాయకులు అడ్డపల్లి నాగేశ్వరరావు, మంగళగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలు శ్యామల, ఎంఎస్పీ మంగళగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు నాగేంద్రం, పట్టణ అధ్యక్షులు పాతకోటి భాస్కర్, రాజేష్, ఎమ్మార్పీఎస్ మంగళగిరి మండల కన్వీనర్ కట్టెపోగు కళ్యాణ్, పాల్గొన్నారు.

త్వరలోనే ప్రకాశం పంతులు విగ్రహావిష్కరణ



తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్‌ని నిర్మించిన మహానుభావుడు, మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహావిష్కరణ త్వరలోనే చేస్తామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. మంగళవారం నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరం కొండవీటి వాగు బకింగ్‌హామ్ కెనాల్ ఎక్స్ క్లూయిస్ వద్ద మూడు రోడ్ల సెంటర్‌లో నిర్మిస్తున్న ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే శాసనమండలి ఎథిక్స్ చైర్మన్ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవిలతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి వారి చరిత్రను తెలియజేసేందుకు పార్కు ఏర్పాటుచేసి విగ్రహాన్ని నెలకొల్పు తున్నట్లు తెలిపారు. కమిషనర్ శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, తాడేపల్లి జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, వైఎస్సార్ సీపీ తాడేపల్లి అధ్యక్షులు వేణుగోపాలస్వామిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

- పలు అలంకారాలలో అమ్మవారు దర్శనం
- పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు



దుగ్గిరాల మండలం మోరంపూడిలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



కాశీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారు



తాడేపల్లి మండపం సెంటర్‌లోని శివాలయంలో అన్నపూర్ణాదేవిగా..



అమీనాబాద్‌లో విశేష అలంకారంలో మూలాంకురేశ్వరి అమ్మవారు

తాడేపల్లిరూరల్: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌తో పాటు, దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో వేంచేసిన ఉన్న మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి గాయత్రీ అలంకారం చేసి భక్తులకు దర్శన మిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి, ఫౌండర్ ట్రస్టీ సభ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మోరంపూడిలో....
దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక విగ్రహానికి మంగళవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఉండవల్లిలో...
ఉండవల్లి సెంటర్‌లో శ్రీ గణేష్‌యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి గాయత్రీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు.

తాడేపల్లి బొమ్మల మండపం సెంటర్‌లో....
తాడేపల్లి బొమ్మల మండపం సెంటర్‌లో వేంచేసిన ఉన్న గంగ బాలత్రిపుర సుందరీదేవి శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత శ్రీ త్రిపుర తాండవేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న అమ్మవారికి శ్రీ దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా అన్నపూర్ణదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనమిచ్చారు.

విజయకీలాద్రిపై.....
సీతానగరం విజయకీలాద్రిపై వేంచేసి ఉన్న అమ్మవారికి త్రిదండి చిన్నజీయర్‌స్వామి, అహోబిల రామాను జీయర్‌స్వామి వార్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకారం చేసి, నవ కలశ స్నపనం, తిరుమంజన సేవ, అమ్మవారికి సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో దేవీ నవరాత్రుల్లో భాగంగా మూడోరోజు మంగళవారం అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి ఆలయంలో ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అర్చకులు అయ్యన్నశాస్త్రి అభిషేకాలు నిర్వహించి ఖడ్గమాల కుంకుమార్చనలు చేశారు. ఫిరంగిపురంలో విజయ దుర్గాకాలనీలోని విజయదుర్గామాతకు అర్చకులు రాజేంద్రశర్మ విశేష పూజలు చేసి కుంకుమార్చనలు నిర్వహించారు. వాసవీమాతను అర్చకులు అన్నపూర్ణమాతగా అలంకరించి కుంకుమార్చన చేశారు.

మంగళగిరి: నగరంలో దసరా నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నగరంలోని ఆలయాలలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారు వివిధ ఆలయాలలో వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమివ్వగా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నగరంలో వేంచేసి వున్న శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి ఆలయంలో వేంచేసి వున్న శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో, శివాలయంలో దుర్గాదేవిగా, పాతమంగళగిరి కనకదుర్గానగర్‌లో గాయత్రిదేవిగా, కాశీమాత, అఖిలాండేశ్వరి ఆలయాలలో అన్నపూర్ణ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా భక్తులు అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గాయత్రీ అమ్మవారు



మంగళగిరి శివాలయంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



పాత మంగళగిరిలోని కనకదుర్గ ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో..

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

- ప్రజలందరి హెల్త్ డేటా సేకరణ
- ప్రతి ఇంటికి వెళ్లి వైద్యం
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



సీతానగరంలో కళ్లజోళ్లను అందిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి



తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడిలో మందులు పంపిణీ చేస్తున్న సురేష్‌కుమార్



మందడంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల

తాడేపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం భారతదేశానికే ఆదర్శమని, దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి ఇంటిలో ఉన్న సభ్యుల హెల్త్ డేటాను సేకరించి వైద్యసేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. మంగళవారం నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరం పీహెచ్‌సీలో ఎమ్మెల్యే ఆర్కే, మాజీ మంత్రి, శాసనమండలి ఎథిక్స్ చైర్మన్ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవితో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత విషయాలను సేకరించి దోపిడీకి పాల్పడితే ఈ ప్రభుత్వం వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఇంటింటికి తిరిగి సర్వే చేసి ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉండేటట్లు ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. దీనిని ప్రతిపక్ష నాయకులు వక్రీకరించి మాట్లాడుతున్నారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో ఎంతో మంది పేదలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తోందని, అవసరమైతే ప్రభుత్వ వైద్యులే ఆరోగ్యశ్రీ కలిగిన కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించి శస్త్రచికిత్స చేయించి ఉచితంగా మందులు అందజేస్తున్నారన్నారు. గతంలో ఆశా వర్కర్లకు రూ.3 వేలు మాత్రమే జీతం ఇచ్చేవారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.10 వేలు అందజేస్తోందని, గతంలో ఎటువంటి సేవలు అందించేవారో ఇప్పుడు కూడా అవే సేవలు అందిస్తున్నారని, అయినా ఆశా వర్కర్లు కొన్ని సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని అన్నారు. ముందుగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే ఆర్కే పరామర్శించారు. అనంతరం పౌష్టికాహార కిట్లతోపాటు, కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కిరణ్, నగర కమిషనర్ శారదాదేవి, అడిషనల్ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, ఎస్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, తాడేపల్లి జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

లచ్చన్నగుడిపూడి(తాడికొండ): జగనన్న ప్రభుత్వంలో పేదవాడికి ఆరోగ్యానికి భరోసా ఉందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి, తుళ్లూరు మండలం మందడం గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోగులను పరామర్శించి ఆరోగ్య సురక్ష శిబిరంలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, సర్పంచ్ గునుగునూరి అలివేలమ్మ, మాజీ సర్పంచ్ గునుగునూరి సాంబిరెడ్డి, ముక్కామల సర్పంచ్ చిమటా వెంకటేశ్వర్లు, షేక్ బాజీ, తుళ్లూరు మండల నాయకులు కొప్పుల శేషగిరిరావు, ఆలూరి శ్రీనివాసరావు, ఆరేపల్లి, జోజి, డీజే శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

– తుళ్లూరు మండలం మందడం గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు ఆలూరి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నందిగం సురేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, చలివేంద్రం సురేష్, దానం సాంబయ్య పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడికొండూరు: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజల సంక్షేమానికి వేలాది కోట్లు నిధులను పలు రకాల సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పేరేచర్లలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, ఎంపీడీవో ప్రభాకరరావు, తహసీల్దారు శ్రీనివాసశర్మ, స్పెషల్ ఆఫీసర్ వీరాచారి, సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, ఈఓపీఆర్డీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రహమాన్, అబ్బాస్, జి.రాంబాబు, పి.అర్జున్‌రావు, ముత్యాల బాలస్వామి పాల్గొన్నారు.

ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతంలో మంగళవారం గుర్తుతెలియని రెండు మృతదేహాలను పోలీసులు గుర్తించారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణానది దిగువ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. గచ్చకాయ రంగు జీన్స్ ప్యాంట్, బ్రౌన్ కలర్ నెట్ బనియన్ ధరించి ఉన్నాడు. అతని వయసు సుమారు 40 సంవత్సరాలు ఉండవచ్చు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. కృష్ణానది సీతానగరం పుష్కర ఘాట్లపై సుమారు 80 సంవత్సరాల ఉండి గ్రీన్ కలర్ కాటన్ చీరపై గోల్డ్ అంచు ఉన్న చీర ధరించిన వృద్ధురాలు మృతదేహం లభించిందని ఆమె వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, కృష్ణానదిలో ఉన్న మృతదేహం ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నామని, వృద్ధురాలు గత కొంతకాలం నుంచి ఇక్కడే ఉంటోందని, అనారోగ్యంతో మృతి చెంది ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ఎవరైనా ఈ మృతదేహాలను గుర్తిస్తే తాడేపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

ఇరువురికి తీవ్రగాయాలు

మేడికొండూరు: ద్విచక్రవాహనాన్ని అధిగమించే క్రమంలో లారీ ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఘటన మేడికొండూరులో మంగళవారం సాయంత్రం జరిగింది. బీహార్‌కు చెందిన యువకులు దినేష్, నఫీఖాన్‌లు ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి నుంచి పేరేచర్ల వైపు వెళుతున్నారు. మార్గంమధ్యలో మేడికొండూరులోని జిల్లాపరిషత్ హైస్కూల్ బ్రిడ్జి వద్ద వెనుక నుంచి లారీ బలంగా ఢీకొంది. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూనివర్సల్ కళాశాలలో మేరీ మట్టి-మేరీదేశ్

మేడికొండూరు: మండలంలోని డోకిపర్రు అడ్డ రోడ్డు వద్దగల యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మేరీ మట్టి–మేరీ దేశ్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం సంఘటన్, కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాల క్రీడ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నెహ్రూయువ కేంద్రం జిల్లా యువత అధికారి దేవిరెడ్డి కిరణ్మయి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి బియ్యం, మట్టిని సేకరించి పంచ్ ప్రాణ ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ కేశవరెడ్డి, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, ఎంపీడీఓ ప్రభాకరరావు ఉన్నారు.

అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయండి

ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. మంగళవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవిలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నగర పరిధిలోని యర్రబాలెంలో రూ.4 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రోడ్లు, డ్రెయిన్‌లు, కల్వర్టులు, అంగనవాడీ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు ఆటలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని కోరారు.

క్రయ విక్రయదారులకు వేదికగా చేనేత భవనం

పాతబస్టాండ్ ఆవరణలో పూర్తి కావస్తున్న ప్రగడ కోటయ్య, వైఎస్సార్ చేనేత భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంగళగిరి చేనేత ఉత్పతుల క్రయవిక్రయదారులకు వేదికగా చేనేత భవనం నిర్మాణం జరుగుతుందన్నారు. మార్కెట్‌లోని తెనాలి రోడ్డులో వస్త్ర దుకాణాల కారణంగా ట్రాఫిక్ వలన వాహనాల పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో దుకాణదారులతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడేవారన్నారు. చేనేత భవనం నిర్మాణంతో దుకాణదారుల వ్యాపారం మరింత విస్తృతంగా జరిగే అవకాశముందన్నారు. నగర నడిబొడ్డున రూ.4 కోట్లతో నిర్మిస్తున్న చేనేత భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులు సత్వరమే పూర్తిచేసి త్వరలోనే అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. చేనేత సూరీడు ప్రగడ కోటయ్య, చేనేత బాంధవుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల పేర్ల మీద నిర్మాణం జరుపుకుంటున్న చేనేత భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. నిడమర్రు రైల్వే గేటు పక్కన వుడా కాలనీకి నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

కార్పొరేట్ స్థాయిలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం

నగరంలో జరుగుతున్న వివిధ కమ్యూనిటీలకు చెందిన సామాజిక భవనాలను కార్పొరేట్ స్థాయిలో నిర్మాణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. నీరుకొండ శిబిరం బాపూజీనగర్‌లో పూర్తి చేసుకుంటున్న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని పరిశీలించారు. పెండింగ్ పనులను సతర్వమే పూర్తి చేయాలని సూచించారు. డీఈ కృష్ణారెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏఈ కిషోర్, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మహ్మద్ ఫిరోజ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థుల ఎంపిక

ఫిరంగిపురం: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఫిరంగిపురంలోని సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం సిస్టర్ ఒట్టి థెరసమ్మ తెలిపారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల చిలుకలూరిపేటలో నిర్వహించిన అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు డి.జనని, ఆర్.గౌతమి, సయ్యద్ మరియాంబి, సీహెచ్ ప్రసన్నకుమారి, పి.మరియకీర్తి, జి.లక్ష్మీసుకన్యలు విశేష ప్రతిభ కనబర్చారని చెప్పారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పీజే నిర్మలామేరి, వి.శిల్ప, వేళాంగిణిరెడ్డి, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్ఎం సిస్టర్ థెరసమ్మ, ఉపాధ్యాయులు

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన వికలాంగురాలు సమాను దుర్గ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించి మంగళవారం రేవేంద్రపాడు సర్పంచ్ పలుకూరి మేరమ్మ అందజేశారు. మధూ నాగదుర్గ, బాజీ, వెంకట సుబ్బయ్య, నాగేశ్వరరావు ఉన్నారు.



● 'ధన'లక్ష్మి

నగరంలోని కొత్తపేటలో వేంచేసి ఉన్న శ్రీ బాలచాడేశ్వరి దేవి ఆలయంలోని అమ్మవారు మంగళవారం శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.2లక్షలతో ధనలక్ష్మిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

-మంగళగిరి